సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 7 । ఏప్రిల్ । 2025



ట్రిపుల్ ఐటీ క్వార్టర్స్‌లో చోరీ
నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యాసంస్థ ప్రాంగణంలోని సిబ్బంది క్వార్టర్స్‌లో శనివారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. 8లో



ఆక్వాను ఆదుకోండి
ఆక్వాను ప్రభుత్వం ఆదుకోవాలని లేకుంటే తమకు ఆత్మహత్యలే శరణ్యమని ఆక్వా రైతులు గణపవరంలో ఆందోళన చేపట్టారు. 8లో

అలుగుల సందడి
పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని పాపికొండల అభయారణ్య ప్రాంతంలో అరుదైన అడవి అలుగులు సంచరిస్తున్నాయి. 8లో



న్యూస్‌రీల్

స్కౌట్స్, గైడ్స్‌లో రికార్డు



పెదతాడేపల్లి గురుకుల విద్యాసంస్థ ప్రతినిధులకు సర్టిఫికెట్ అందిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో మండలంలోని పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాసంస్థ చోటు దక్కించుకుంది. పాఠశాలకు చెందిన 450 మంది విద్యార్థులు 18 యూనిట్లుగా ఏర్పడి స్కౌట్స్, గైడ్స్‌లో ప్రవేశ పరీక్ష రాసి అర్హత సాధించారు. దీంతో ఒకే పాఠశాల నుంచి 450 మంది విద్యార్థులు స్కౌట్స్, గైడ్స్ విభాగంలో చేరడాన్ని అభినందిస్తూ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం కల్పించినట్లు ఆ సంస్థ రాష్ట్ర పరిశీలకులు సిరిమువ్వ శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. సర్టిఫికెట్‌ను జిల్లా విద్యాశాఖాధికారి నారాయణ, స్కౌట్స్, గైడ్స్ జిల్లా కార్యదర్శి ఉంగరాల నాగేశ్వరరావు ప్రిన్సిపల్ బి.రాజారావుకు అందజేశారు. విద్యార్థులను, స్కూలు ఉపాధ్యాయ బృందాన్ని డీఈఓ నారాయణ అభినందించారు.

గుగ్గులోతుకు గురుజ్యోతి అవార్డు



గుగ్గులోతు కృష్ణకు అవార్డు ప్రదానం చేస్తున్న గ్లోబల్ ఫౌండేషన్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉపాధ్యాయ, సామాజిక సేవా రంగంలో సుదీర్ఘ సేవలకు గుర్తింపుగా విశాఖకు చెందిన గ్లోబల్ ఫౌండేషన్ సంస్థ గురుజ్యోతి రాష్ట్ర అవార్డు–2025ను ఏలూరుకు చెందిన గుగ్గులోతు కృష్ణకు ప్రకటించారు. ఆదివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాసంశెట్టి కృష్ణమూర్తి పురస్కారానికి కృష్ణకు అందజేశారు. గోల్డ్ మెడల్, సర్టిఫికెట్ జ్ఞాపిక, సన్మాన పత్రాన్ని అందజేశారు. కృష్ణ ఏలూరు ఇందిరా కాలనీ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఉపాధ్యాయ రంగంలో 28 ఏళ్ల నుంచి సేవలందిస్తున్నారు. ఆయన్ను ఏపీటీఎఫ్1 1938 జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.రత్నం బాబు, జి.మోహన్‌రావు అభినందించారు.

పెద్దిరాజుకు పురస్కారం



ఉంగుటూరు: ఉంగుటూరు నం.1 పాఠశాల హెచ్‌ఎం శిరిమామిళ్ల పెద్దిరాజును గ్లోబల్ ఫౌండేషన్ సంస్థ ఉగాది పురస్కారంతో సత్కరించింది. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో పెద్దిరాజును సత్కరించి పురస్కారం అందించారు. విద్యారంగంలో సేవలకు గుర్తింపుగా అవార్డుకు ఎంపికచేశారు. పెద్దిరాజును ఎంఈఓ రవీంద్రభారతి, ఎంఈఓ పరసా వెంకటేశ్వరరావు అభినందించారు.

ఆరోగ్యశ్రీ సేవలు బంద్

వైద్య సేవ.. అందని తోవ
- నేటినుంచి నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో సేవలు నిలుపుదల
- బకాయిల చెల్లింపులో ప్రభుత్వ నిర్లక్ష్యం
- జిల్లాలో 36 నెట్‌వర్క్ ఆస్పత్రులు
- సుమారు రూ.150 కోట్ల బకాయిలు
- పేదల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం



భీమవరంలో ఓ నెట్‌వర్క్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ సేవల కోసం వేచి ఉన్న జనం (ఫైల్)

భీమవరం(ప్రకాశం చౌక్) : పేదల ఆరోగ్యానికి భరోసాగా నిలిచే ఆరోగ్యశ్రీ (ఎన్‌టీఆర్ వైద్య సేవ) సేవలు నిలిచిపోనున్నాయి. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కుట్రలు చేస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్‌టీఆర్ వైద్యసేవలో సేవలందించే ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రులకు బిల్లులు చెల్లించకుండా ప్రభుత్వం కోట్లలో బకాయిలు పెట్టింది. దీంతో సోమవారం నుంచి ఆస్పత్రుల యాజమాన్యాలు సేవలు నిలుపుదలకు నిర్ణయం తీసుకున్నాయి.

నిర్వహణ భారమన్నా పట్టడం లేదు

బిల్లు బకాయిలపై ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పటల్స్ అసోసియేషన్ (ఆషా) ఇప్పటికే పలుమార్లు విన్నవించుకున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదు. ఆస్పత్రుల నిర్వహణ భారంగా మారిందని, వైద్యులకు జీతాలు ఇవ్వలేకపోతున్నామని, అప్పులు చేసి సేవలందించాల్సి వస్తుందన్నా ప్రభుత్వానికి పట్టడం లేదు. దీంతో ఈనెల 7 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఎన్‌టీఆర్ వైద్య సేవలు నిలిపివేయాలని ఆషా నిర్ణయం తీసుకుంది. దీంతో జిల్లాలోని 36 ప్రైవేట్ ఆస్పత్రుల్లో సేవలు నిలిచిపోనున్నాయి. దీనిపై ఉచిత వైద్యం కోసం ఎదురుచూస్తున్న వారు ఆందోళన చెందుతున్నారు.

రూ.150 కోట్ల బకాయిలు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన 10 నెలల్లో జిల్లాలోని 36 నెట్‌వర్క్ ఆస్పత్రులకు రూ.కోట్లలో బిల్లుల బకాయిలు ఉన్నాయి. ఒక్కో ఆస్పత్రికి బిల్లుల రూపంలో రూ.2 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు రావాల్సి ఉంది. మొత్తంగా సుమారు రూ.150 కోట్ల బకాయిలు ఉన్నట్టు తెలిసింది.

జిల్లాలో నెట్‌వర్క్ ఆస్పత్రులు	
మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు	20
సింగిల్ స్పెషాలిటీ ఆస్పత్రులు	16
రోజుకు ఓపీ సుమారు	1,500
రోజుకు ఇన్ పేషెంట్లు సుమారు	500
ఇప్పటికే ఆస్పత్రుల్లో ఇన్‌పేషెంట్లు సుమారు	2,000

పేదల పరిస్థితి ఏంటి?

నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు నిలుపుదల చేస్తే పేద, మధ్యతరగతి వర్గాల ప్రజల ఆరోగ్య పరిస్థితి ఏంటనేది ప్రశ్నార్థకంగా మారింది. ఆరోగ్యశ్రీ ఉందని భరోసాగా ఉన్న పేదలకు కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో వారి ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. జిల్లాలో సుమారు 10 లక్షల మంది వరకు ఆరోగ్యశ్రీ పథకంలో అర్హులు ఉన్నారు. ఇప్పటికే ఆస్పత్రుల్లో ఇన్‌పేషెంట్లుగా ఉన్న వారికి సేవలు అందుతాయా.. లేదా అన్నదానిపై కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఇన్ పేషెంట్లుగా సుమారు 2 వేల మంది వరకు ఉన్నారు.

గత ప్రభుత్వంలో నిర్విరామంగా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ సేవలు నిర్విరామంగా అందాయి. కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్య సేవలతో పాటు రోగులు, బాలింతలకు ఆర్థిక సాయం అందించేలా ఆరోగ్యశ్రీ ఆసరా పథకాన్ని పక్కాగా అమలు చేశారు. ఆరోగ్యశ్రీలో వ్యాధుల సంఖ్యను 1,800 నుంచి 3,200 వరకు పెంచడంతో పాటు ఆరోగ్యశ్రీ పరిధిలో ఖర్చును రూ.25 లక్షల వరకు చేసిన ఘనత మాజీ సీఎం జగన్‌కే దక్కింది. నెట్‌వర్క్ ఆస్పత్రులకు బిల్లుల చెల్లింపుల్లో ఇబ్బందులు లేకుండా చూశారు. దీంతో సేవల నిలుపుదల అన్నమాటే తలెత్తలేదు. ఆరోగ్యశ్రీ పథకం అమలు, బిల్లుల చెల్లింపుల విధానంతో పలు ప్రైవేట్ ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ పథకం అమలుకు ముందుకు వచ్చాయి. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పథకం అమలుపై నీలినీడలు అలముకున్నాయి.

రేపు వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశం



కైకలూరు: వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా కుటుంబ సభ్యుల ఆత్మీయ సమావేశం మంగళవారం ఉదయం 9 గంటలకు ఏలూరు మినీ బైపాస్ రోడ్డు క్రాంతి కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) ఆదివారం తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీ అనుసరించాల్సిన కార్యచరణపై చర్చ ఉంటుందన్నారు. ముఖ్య అతిథులుగా శాసనమండలి ప్రతిపక్ష నేత, ఉభయగోదావరి జిల్లాల పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ, పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, మాజీ పార్లమెంట్ సభ్యులు కోటగిరి శ్రీధర్, పార్లమెంట్ కో–ఆర్డినేటర్ కారుమూరి సునీల్‌కుమార్, ఉంగుటూరు, ఏలూరు, దెందులూరు, నూజివీడు, చింతలపూడి, పోలవరం అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జులు పుప్పాల వాసుబాబు, మామిళ్లపల్లి జయప్రకాష్, కొఠారు అబ్బయ్యచౌదరి, మేక వెంకట ప్రతాప్ అప్పారావు, కంభం విజయరాజు, తెల్లం బాలరాజు హాజరవుతారన్నారు. శ్రేణులంతా హాజరుకావాలని కోరారు.

నేడు అర్జీల స్వీకరణ

భీమవరం(ప్రకాశంచౌక్): భీమవరం కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరిస్తామని కలెక్టర్ సీహెచ్ నాగరాణి తెలిపారు. డివిజన్, మండల స్థాయిలోనూ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

ధాన్యం కేంద్రాల ప్రారంభమెప్పుడో?

రోడ్లపై ఆరబోస్తున్న రైతులు



సూరప్పగూడెంలో అప్రోచ్ రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

భీమడోలు: ఏప్రిల్ మొదటి వారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఇప్పటికీ ఏర్పాటు చేయలేదు. పంట కోతలు ముమ్మరంగా చేపడుతుండగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కోతలు పూర్తయి చేతికందిన దాళ్వా ధాన్యాన్ని ప్రధాన రోడ్లు, అప్రోచ్ రోడ్లపై ఆరబెడుతున్నారు. నిబంధనలకు అనుగుణంగా తేమ శాతం ఉన్న ధాన్యాన్ని రోడ్లపైనే భద్రపరుచుకుంటున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలని, గోనె సంచులు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు. ఈ సమయంలో వర్షాలు పడితే నిండా మునిగిపోతామని ఆవేదన చెందుతున్నారు. భీమడోలు మండలంలో 13 వేల ఎకరాల్లో దాళ్వా వరి సాగుచేయగా 20 శాతానికి పైగా మాసూళ్లు పూర్తయ్యాయి. 1153, పీఎల్ 126 రకాల పంట వారం ముందుగా కోతలు పూర్తికాగా ఈ పంటను కాపాడుకునేందుకు రైతులు పాట్లు పడుతున్నారు. కొందరు రైతులు దళారులకు అయినకాడికి అమ్ముకుంటున్నారు.

ఇంటర్ విద్యార్థులకు బస్ పాస్‌లు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు జిల్లాలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పూర్తి చేసుకుని ద్వితీయ సంవత్సరంలోకి ప్రవేశించిన విద్యార్థులకు తరగతులు ప్రారంభమైన నేపథ్యంలో వారికి బస్ పాస్‌లు మంజూరు చేయనున్నారు. పాత ఐడీ కార్డుల ఆధారంగా బస్‌పాస్‌లు ఇస్తామని జిల్లా ప్రజా రవాణా అ ధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ద్వితీయ సంవత్సరంలోకి ప్రవేశించిన విద్యార్థులకు మాత్రమే రాయితీ బస్ పాసులు ఇస్తున్నామని పేర్కొన్నారు.

కూటమి పాలనలో ఆక్వా రైతు కుదేలు

- సిండికేట్‌గా దోపిడీ
- టారిఫ్‌ల సాకుతో ధరల తగ్గింపు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు ధ్వజం



కాళ్ల: రాష్ట్రంలో కూటమి నేతల చేతుల్లో ఆక్వా రంగం ఉండటంతో ఇష్టారాజ్యంగా ఆక్వా రైతులను దోచుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు మండిపడ్డారు. మండలంలోని పెదఅమిరంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆక్వా సంస్థలను అడ్డం పెట్టుకుని సిండికేట్‌గా మారి రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని ధ్వజమెత్తారు. టారిఫ్‌ల సాకుతో ధరలు తగ్గిస్తున్నారని విమర్శించారు. ఆక్వా రైతులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం కూటమి నేతలకే కొమ్ము కాస్తోందన్నారు. ఆక్వా రైతులు కుదేలవుతున్నా కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. రాష్ట్రంలో దాదాపు లక్షన్నర మంది రైతులు ఆక్వారంగంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ఫీడ్, సీడు, గిట్టుబాటు ధర విషయంలో రైతులు ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నారన్నారు. పది రోజులుగా అమెరికాలో నెలకొన్న పరిస్థితులతో ఆక్వా పంటను కొనేందుకు బయ్యర్లు ముందుకు రావడం లేదని, ధరలు కిలోకు రూ.40 నుంచి రూ.50కి పడిపోయాయన్నారు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు.


రైతులకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆక్వా రైతులకు అన్నివిధాలా అండగా నిలిచామన్నారు. కరోనా విపత్తు సమయంలో సాధికార కమిటీ ద్వారా ధరల నియంత్రణకు నాటి సీఎం జగన్ చర్యలు తీసుకున్నారని గుర్తుచేశారు. లారీల్లో సరుకు రవాణాకు పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో పాలకులతో మాట్లాడి అనుమతులు ఇప్పించామన్నారు. అలాగే ఫీడు, సీడు ధరలను నియంత్రించామన్నారు. యూనిట్ రూ.1.50కే సబ్సిడీపై విద్యుత్ అందించామన్నారు. ఇలా ఐదేళ్లలో విద్యుత్ సబ్సిడీ రూపంలో రైతులకు రూ.3,500 కోట్ల లబ్ధి చేకూర్చామన్నారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి ఫిషరీస్ అసిస్టెంట్‌ను నియమించామన్నారు.

కూటమి సర్కారులో సిండికేట్‌దే రాజ్యం

కూటమి పాలనలో వ్యాపారులు సిండికేట్‌గా రైతుల పొట్టకొడుతున్నా కూటమి ప్రభుత్వం నియంత్రించడం లేదని ముదునూరి ఆరోపించారు. సిండికేట్ మొత్తం కూటమి నాయకులే కావడంతో ప్రభుత్వం చూసీచూడనట్టు వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎగుమతిదారులు, ఫీడు ఉత్పత్తి, తయారీదారులు, యాజమాన్యాలు ప్రభుత్వ అండదండలతో నడుస్తున్నారనే భావన రైతుల్లో ఉందన్నారు. అలాగే ఆక్వా జోన్, నాన్ ఆక్వా జోన్ పేరుతో విద్యుత్ సబ్సిడీలను తగ్గించారన్నారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు చార్జీల పేరుతో రైతులను వేధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 50 కౌంట్ వరకు మాత్రమే అమెరికాకు ఎగుమతి అవుతున్నా 70 నుంచి 100 కౌంట్ వరకు ధరలు తగ్గించడం దారుణమన్నారు. ఆక్వా రైతులకు వైఎస్సార్ సీపీ అండగా నిలుస్తుందని, వారి పక్షాన పోరాటం చేస్తుందని ముదునూరి తెలిపారు. సీడు, ఫీడు ధరల నియంత్రణ, ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులపై దృష్టి సారించి ప్రభుత్వం ఆక్వా రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

రైతు కంట్లో కారం



తాడేపల్లిగూడెం ఏఎంసీలో మిర్చి బస్తాలు

మిర్చి ధరలు పతనం

తాడేపల్లిగూడెం రూరల్: దేశవాళీ లావు రకం మిర్చి పంట ధరలు అమాంతం పడిపోయాయి. దీంతో గతేడాది ధరను చూసి ఈ ఏడాది సాగు చేసిన రైతులు లబోదిబోమంటున్నారు. ఉభయగోదావరి జిల్లాల నుంచి విశాఖ వరకు ప్రధానంగా దేశవాళీ లావు రకాలను పచ్చళ్లకు, కారాలకు వినియోగిస్తుంటారు. ప్రధానంగా గుంటూరు, వేలేరుపాడు, జంగారెడ్డిగూడెం, ఆరిపాటిదిబ్బలు, పంగిడి, భద్రాచలం, సత్తుపల్లి, వేమసూరి, వెంకటాపురం, చర్ల ప్రాంతాల్లో దేశవాళీ లావు రకాలను సాగు చేస్తుంటారు. ఇలా పండించిన పంటను గుంటూరు, తాడేపల్లిగూడెంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ఏటా రైతులు తీసుకొచ్చి విక్రయిస్తుంటారు.


గూడెంలో 25 వేల టన్నుల వరకు..

తాడేపల్లిగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఏటా 20 వేల నుంచి 25 వేల టన్నుల మిర్చి అమ్మకాలు జరుగుతాయి. ధర బాగుండటమే ఇందుకు కారణం. ఇక్కడ 100 నుంచి 150 మంది కమీషన్ వ్యాపారులు రైతుల నుంచి మిర్చి కొనుగోలు చేసి బయట మార్కెట్‌కు విక్రయిస్తారు. ఈ క్రమంలో విశాఖ వరకు ఇక్కడ నుంచే మిర్చి ఎగుమతి జరుగుతుంటుంది.

పెట్టుబడులు పెరిగి..

గతేడాది ధర ఆశాజనకంగా ఉండటంతో ఈ సీజన్‌లో రైతులు మిర్చిని ఎక్కువగా పండించారు. ఈ క్రమంలో విస్తీర్ణం పెరిగినా చీడపీడల కారణంగా దిగుబడులు లేవని రైతులు అంటున్నారు. ఎకరాకు 10 క్వింటాళ్ల నుంచి 4 క్వింటాళ్లకు దిగుబడులు పడిపోయాయని చెబుతున్నారు. గతేడాది కిలో రూ.500 నుంచి రూ.700 పలకగా ప్రస్తుతం నాణ్యతను బట్టి రూ.200 నుంచి రూ.300కు వ్యాపారులు కొంటున్నారని అంటున్నారు. దీంతో లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంట పండించిన రైతులకు నష్టాలు మిగులుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. మిర్చిలో తేజ వెరైటీ సన్నాలు కిలో రూ.80 నుంచి రూ.100 కూడా పలకడం లేదని వాపోతున్నారు.

రూ.90 వేలు నష్టం



మిర్చి పంటకు ఎకరాకు ఎరువులు, పురుగు మందులు, కూలీల ఖర్చులు కలిపి రూ.1.50 లక్షల వరకు ఖర్చయ్యింది. తీరా పంట చేతికొచ్చే సమయానికి దిగుబడులు, ధర పతనం కావడంతో ఆశించిన ధర లభించడం లేదు. పంట మార్కెట్‌కు తీసుకొచ్చి విక్రయిస్తే క్వింటాలుకు రూ.10 వేల నుంచి రూ.15 వేలు మాత్రమే వస్తోంది. దీంతో ఎకరానికి దాదాపు రూ.90 వేల వరకు నష్టం చవిచూడాల్సి వస్తోంది. ఈ సీజన్‌లో మిర్చి రైతుకు కన్నీళ్లే మిగిలాయి.

– వెలిశల రాధాకృష్ణ, కల్లూరుగూడెం, వేమసూరి మండలం, ఖమ్మం జిల్లా, తెలంగాణ

రమణీయం.. రాములోరి కల్యాణం



ద్వారకాతిరుమల : నిత్య కల్యాణ మండపంలో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న పండితులు



పెంటపాడు : బైరాగిమఠంలో కల్యాణమూర్తులు



పెంటపాడు : కె.పెంటపాడులో కోలాటం

ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవం ఆదివారం నేత్రపర్వంగా జరిగింది. శ్రీరామ నవమిని పురస్కరించుకుని స్వామి వారి నిత్యకల్యాణ మండపంలో సీతారాముల కల్యాణ వేడుకను నిర్వహించారు. ముందుగా తొళక్క వాహనంపై సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తులకు విశేష పుష్పాలంకారాలు చేసి ఆలయ ప్రధాన రాజగోపురం, క్షేత్ర పురవీధుల మీదుగా నిత్య కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. మండపంలో చిన వెంకన్న, పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లతో పాటు మరో రజిత సింహాసనంపై సీతారాముల ఉత్సవమూర్తులను వేంచేపు చేసి అర్చకులు కల్యాణ తంతును ప్రారంభించారు. రాత్రి తొళక్క వాహనంపై సీతారాముల గ్రామోత్సవం అట్టహాసంగా జరిగింది. అలాగే జిల్లావ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. సీతారాముల కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు.

– ద్వారకాతిరుమల



ద్వారకాతిరుమల : తొళక్కం వాహనంపై ఊరేగింపు



పెనుగొండ: వడలిలో రథాన్ని లాగుతున్న చిన్నారులు

క్లుప్తంగా

జాక్ చిత్ర బృందం సందడి


భీమవరం విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులతో జాక్ చిత్రం హీరో, హీరోయిన్లు

భీమవరం: భీమవరం విష్ణు మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో జాక్ చిత్ర బృందం శనివారం రాత్రి సందడి చేసింది. హీరో సిద్ధు, హీరోయిన్ వైష్ణవి విద్యార్థులతో కలిసి డ్యాన్స్‌లు చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి సెల్ఫీలకు ఫోజులిచ్చారు. కార్యక్రమంలో చిత్ర నిర్మాత ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గుబ్బల మంగమ్మ గుడికి పోటెత్తిన భక్తులు


భక్తులతో కిటకిటలాడుతున్న గుబ్బల మంగమ్మ సన్నిధి

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన కామవరం సమీపంలోని అటవీప్రాంతంలో కొలువై ఉన్న గుబ్బల మంగమ్మ గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు విజయవాడ, మచిలీపట్నం, తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం, సత్తుపల్లి, అశ్వారావుపేట ప్రాంతాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు వాహనాలతో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చేతల్లిగా వరాలిచ్చే అమ్మగా పేరుపొందడంతో మంగమ్మగుడికి వచ్చే భక్తుల సంఖ్య ప్రతీ వారం పెరుగుతూనే ఉంది.

నేడు క్షీరారామలింగేశ్వర స్వామి కల్యాణం


స్వామిని పెండ్లి కొడుకును చేస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివార్ల కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామిని పెండ్లి కుమారుడిని చేశారు. ముందుగా విఘ్నేశ్వర పూజ, అంకురార్పణ, ధ్వజారోహణ, అగ్నిప్రతిష్ఠాపన, బలిహరణ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం రాత్రి 5.05 గంటలకు (తెల్లవారితే మంగళవారం) స్వామి వారి కల్యాణం జరగనుంది. మధ్యాహ్నం 3 గంటలకు రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు తెలిపారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఆలయ అభిషేక పండిట్ భమిడపాటి వెంకన్న, ఇ.సూరిబాబు, ఆలయ ప్రధానార్చకులు కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

పాపికొండల్లో అలుగుల సందడి

- అరుదైన వన్యప్రాణుల సంచారం గుర్తింపు
- బెదిరితే బంతిలా మారిపోయే గుణం
- వణ్యప్రాణులకు వేటగాళ్ల నుంచి ముప్పు


వీపుపై సంతానాన్ని తీసుకెళ్తున్న అలుగు


భయంతో ముడుచుకుపోయిన అలుగు

బుట్టాయగూడెం: పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని పాపికొండల అభయారణ్య ప్రాంతంలోని అడవుల్లో అరుదైన అడవి అలుగులు సంచరిస్తున్నాయి. వీటిని పాంగోలియన్ అని కూడా పిలుస్తారు. చైనీస్ పాంగోలియన్, ఆసియా పాంగోలియన్, సుండా పాంగోలియన్, పాతమాన్ పాంగోలియన్ అని నాలుగు రకాలు అలుగులు ఉంటాయి. ఈ అలుగు సుమారు 20 ఏళ్లు బతుకుతాయి. చీమలు, పురుగులను ఆహారంగా తీసుకుంటాయి. ఈ జీవికి పొడవైన నాలుక ఉంటుంది. ఎక్కువ శాతం దట్టమైన అటవీ ప్రాంతాల్లో, అధికంగా వర్షాలు కురిసే ప్రాంతాలతో పాటు ఎడారి ప్రాంతాల్లో ఇవి ఎక్కువగా జీవిస్తుంటాయి. 1821లో తొలిసారిగా ఈ జంతువుల సంచారాన్ని గుర్తించినట్లు వైల్డ్‌లైఫ్ అధికారులు చెబుతున్నారు. ఈ జీవులకు భయపడితే ముడుచుకుపోయి తమను తాము రక్షించుకుంటాయి. వీటి చర్మంపై ఉండే పెంకులు చాలా దృఢంగా ఉంటాయి. అరుదైన ఈ వన్యప్రాణులు పాపికొండల అభయారణ్యం ప్రాంతంలో సుమారు 25 నుంచి 30 పైగా సంచరిస్తున్నట్లు వైల్డ్‌లైఫ్, ఫారెస్టు అధికారులు తెలిపారు.

రాత్రి వేళ సంచారం

అలుగులు పగలు కంటే రాత్రి సమయంలోనే ఎక్కువగా సంచరిస్తుంటాయని అధికారులు చెబుతున్నారు. పగటిపూట గోతుల్లో, తొర్రల్లో, చెట్ల పైన దాగి ఉంటాయి. రాత్రి సమయాల్లో ఆహారం కోసం అన్వేషిస్తాయి. తెల్లవారేసరికి తొర్రల్లోకి చేరుకుంటాయి. ఈ అలుగు రెండు సంవత్సరాలకు ఒకసారి పిల్లలకు జన్మనిస్తుందది. కోతి మాదిరిగానే తాను జన్మనిచ్చిన పిల్లలను వీపుపై ఎక్కించుకుని ఆహార అన్వేషణ సమయంలో తిప్పుతుందని చెబుతున్నారు. అలుగులు సంచరిస్తున్న సమయంలో ఎలాంటి అలికిడి విన్నా బెదిరిపోయి బంతిలాగా ముడుచుకుపోతాయి. కదలకుండా గట్టిగా ముడుచుకుని ఉండిపోతాయి. అలుగులకు ఎదురు దాడి చేసే గుణం కూడా ఉంటుందని వైల్డ్‌లైఫ్ అధికారులు చెబుతున్నారు. ఈ అలుగుల వీపుపై ఉండే పెంకులు కత్తిలాగా పదునుగా ఉంటాయి. ఇవి సింహం కూడా తినలేనంత గట్టిగా ఉంటాయి. ఈ అలుగు సంతతి పాపికొండల అభయారణ్యంలో ఎక్కువగా ఉన్నట్లు వైల్డ్‌లైఫ్ అధికారులు తెలిపారు.

అలుగులపై స్మగ్లర్ల కన్ను

ఏజెన్సీ ప్రాంతంలోని అభయారణ్యంలో సంచరిస్తున్న అలుగులపై స్మగ్లర్ల కన్ను పడింది. అరుదైన అలుగు జంతువు వీపుపై ఉండే పెంకులకు అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్నట్లు చెబుతున్నారు. ఈ పెంకుల విలువ రూ.లక్షల్లో ఉంటుందని అంటున్నారు. అలుగు పెంకులను చైనాలోని మందుల తయారీలో ఉపయోగిస్తారని సమాచారం. గతంలో అలుగును బుట్టాయగూడెం, జంగారెడ్డిగూడెం ప్రాంతాల్లో ఇద్దరు వ్యక్తులు రూ.20 లక్షలకు విక్రయిస్తామని ఫేస్‌బుక్‌లో వీడియో అప్‌లోడ్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఆ సమయంలో తమ ఉన్నతాధికారులు ఆ వీడియోను చూసి స్మగ్లర్లను పట్టుకునేందుకు ఆదేశాలు ఇవ్వడంతో అలుగు అమ్మకానికి పెట్టిన ఇద్దరు వ్యక్తులను వలపన్ని చాకచక్యంగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు వైల్డ్‌లైఫ్ అధికారులు తెలిపారు. అరుదైన వన్యప్రాణులను వేటాడి విక్రయించాలని చూస్తే ఏడేళ్ల శిక్ష పడే అవకాశం ఉందని, అలాగే రూ.5 లక్షలకు తక్కువ కాకుండా జరిమానా విధిస్తారని అధికారులు పేర్కొన్నారు.

చెరువులో పడి పెయింటర్ మృతి


పెయింటర్ పీ.శ్రీనివాస్

ఆకివీడు: స్థానిక భుజబలరాయుడు మంచినీటి చెరువులో పడి పెయింటర్ పోతురాజుల శ్రీనివాస్(48) ఆదివారం మృతి చెందాడు. స్థానిక సంతపేట ఇల్లాపు వారి వీధిలో నివసిస్తున్న శ్రీనివాస్ అనారోగ్యంతో బాధపడుతూ చల్లదనం కోసం చెరువు గట్టు వద్దకు వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. అతనికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. శ్రీనివాస్ మృతితో ఆ ప్రాంతంలో విషాద చాయలు అలుముకున్నాయి.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెంటపాడు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై స్వామి తెలిపారు. పెంటపాడుకు చెందిన సత్తి సూర్యచంద్రారెడ్డి (69) బైక్‌పై శనివారం గణపవరం మండలం పిప్పర వెళ్లి తిరిగి వస్తుండగా గూడెం నుంచి భీమవరం వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతనిని 108 అంబులెన్స్‌లో గూడెంలోని ఒక ప్రేవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

ట్రిపుల్ ఐటీ సిబ్బంది క్వార్టర్స్‌లో చోరీ


బెడ్‌రూమ్‌లో చిందరవందరగా పడేసి ఉన్న దుస్తులు


ట్రిపుల్ ఐటీలోని ఎన్1 బ్లాక్

నూజివీడు: పట్టణంలోని ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో ఉన్న సిబ్బంది క్వార్టర్స్‌లో శనివారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. ఎన్1 బ్లాక్‌లోని 103, 303 ఫ్లాట్లకు తాళాలు వేసి ఉండటంతో వాటిలో చోరీకి పాల్పడ్డారు. 103 ఫ్లాట్‌లో ఉండే డీన్ అకడమిక్ సాదు చిరంజీవి ఊరు వెళ్లారు. ఆయన భార్య రాత్రి 10 గంటల వరకు ఫ్లాట్‌లోనే ఉండి, ఆ తర్వాత పక్కన ఉండే స్నేహితుల వద్దకు వెళ్లి పడుకుంది. 303లో ఉండే సీఎస్‌సీ ఫ్యాకల్టీ తన ఫ్లాట్‌కు తాళం వేసి సొంతూరు వెళ్లాడు. దీంతో ఈ రెండు ఫ్లాట్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. చప్పుడవుతుండటంతో పక్క ఫ్లాట్ వాళ్లు సెక్యూరిటీకి ఫోన్ చేసి చెప్పారు. సెక్యూరిటీ సిబ్బంది వచ్చేలోగా దొంగలు అక్కడి నుంచి వెళ్లిపోయారు. 103 ఫ్లాట్‌లో బెడ్‌రూమ్‌లోని వస్తువులను, బీరువాలోని దుస్తులను చిందరవందరగా పడేశారు. దాదాపు రూ.6 వేల నగదు చోరీకి గురైంది. 303 ఫ్లాట్‌లో ఏమీ పోలేదని సంబంధిత యజమానులు పేర్కొన్నారు. చోరీ సంగతి తెలిసిన వెంటనే ఎస్‌ఐ జ్యోతిబసు సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. సమాచారాన్ని ఏలూరులోని క్లూస్ టీంకు తెలపగా వారు వచ్చి పరిశీలించి వేలిముద్రలు సేకరించారు.

ట్రిపుల్ ఐటీలో భద్రత డొల్లే

ట్రిపుల్ ఐటీ క్యాంపస్ ఆవరణలోని క్వార్టర్స్‌లో రెండోసారి దొంగతనం జరగడం సంచలనంగా మారింది. గతేడాది ఆగస్టు 20న చోరీ జరిగింది. ప్రతి షిఫ్ట్‌లో 56 మంది సెక్యూరిటీ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నప్పటికీ దొంగలు దర్జాగా చొరబడుతున్నారు. గత నెలలో ఏఆర్ డీఎస్పీ ట్రిపుల్ ఐటీని సందర్శించి సెక్యూరిటీ ఆడిట్ నిర్వహించారు. ఈ ఆడిట్‌లో సెక్యూరిటీ లోపాలను సరి చేసుకోవాలని సూచించారు. సెక్యూరిటీ పాయింట్‌లు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌కు సరిహద్దుల వద్ద లేకుండా ఎక్కడో అవసరం లేనిచోట ఏర్పాటు చేయడం గమనర్హం. ఏ ఇళ్లకు తాళాలు వేశారనేది దొంగలకు ఎలా తెలుస్తుందనేది అంతుబట్టడం లేదు. గతేడాది చోరీకి సంబంధించి దొంగలను ఇప్పటికీ పట్టుకోలేదు. గొడుగువారిగూడెం వైపు నుంచి గోడకున్న ఫెన్సింగ్ తీగలు కత్తిరించి లోపలికి ప్రవేశించి ఉంటారని, దొంగతనం చేసిన తరువాత మళ్లీ అదే దారిలో వెళ్లి ఉండవచ్చని భావిస్తున్నారు.

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు


ద్వారకాతిరుమల మండలం కోడిగూడెంలో అక్రమ మట్టి తవ్వకాలు

ద్వారకాతిరుమల: మండలంలోని కోడిగూడెంలో గ్రావెల్ మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. కొందరు అక్రమార్కులు ఎంతో విలువైన మట్టిని అమ్ముకుని జేబులు నింపుకుంటున్నారు. గ్రామంలోని తూర్పు వైపున ఉన్న చెరువు దాటిన తరువాత డీ ఫారం పట్టా భూమిలో మట్టి అక్రమ తవ్వకాలు గత కొద్దిరోజులుగా సాగుతున్నాయి. జేసీబీ సహాయంతో తవ్వుతున్న మట్టిని టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. ప్రస్తుతం ఈ మట్టిని గ్రామంలోని ఒక పామాయిల్ తోటలో రోడ్డు ఏర్పాటుకు వినియోగిస్తున్నారు. చుట్టుపక్కల ప్రాంతాలకు తరలిస్తున్నారు. టిప్పర్ మట్టిని అక్రమార్కులు రూ. 5 వేలకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. బహిరంగంగా జరుగుతున్న ఈ మట్టి దందాను అడ్డుకోవాల్సిన అధికారులు ఆవైపు కన్నెత్తి చూడకపోవడం పట్ల పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఈ తవ్వకాలను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సొంతింటి కోసం రాయిపై రాయి


బుట్టాయగూడెం మండలం కామవరం అటవీ ప్రాతంలో కొలువైన గుబ్బల మంగమ్మతల్లి గుడి వద్దకు వస్తున్న వేలాది మంది భక్తులు గుడి సమీపంలో రాయి మీద రాయి పెట్టి సొంతిల్లు నిర్మించుకునే భాగ్యం కలిగించు తల్లి! అంటూ మొక్కు కుంటున్నారు. తమకు ఎటువంటి ఇల్లు కావాలో చెబుతూ కొందరు మూడు నుంచి నాలుగు రాళ్లు పేర్చి మొక్కుకుంటున్నారు. ఇలా మొక్కుకుంటే తమ కోర్కులు తీరతాయని భక్తుల నమ్మకం. ఈ మధ్య కాలంలో గుడి ప్రాంగణం సమీపంలో ఎక్కువ మంది భక్తులు రాయి మీద రాయి పెట్టి పూజలు చేస్తున్నారని ఆలయ కమిటీ తెలిపింది.
– బుట్టాయగూడెం

వక్ఫ్ భూములపై కుట్ర రాజకీయాలు

వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ డాక్టర్ కామిలుజమ



ఏలూరు టౌన్: కేంద్రంలోని ఎన్‌డీఏ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ముస్లిం సోదరుల మనోభావాలను దెబ్బతీస్తూ కుటిల రాజకీయాలకు తెరతీశాయని, దేశంలో రాజ్యాంగాన్ని అమలు చేయకుండా సొంత అజెండాతో పనిచేస్తున్నాయని వక్ఫ్ బోర్డు ఏలూరు జిల్లా మాజీ చైర్మన్ డాక్టర్ కామిలుజమ అన్నారు. ఏలూరులో ఆయన ఆదివారం మాట్లాడుతూ... దేశ వ్యాప్తంగా వక్ఫ్ ఆస్తులు, భూములు, అన్యాక్రాంతం చేసేందుకు కుట్ర జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వక్ఫ్ ఆస్తులపై ఏదైనా వివాదం ఏర్పడితే పరిష్కరించేందుకు హైకోర్టు న్యాయమూర్తి నియమించిన ట్రిబ్యునల్ ఉందని, నూతనంగా ప్రవేశపెట్టిన బిల్లులో కలెక్టర్లకు అధికారం ఇవ్వడంపై సందేహాలు, అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. వక్ఫ్ ఆస్తుల పరిపాలన, నియంత్రణకు 1995లో ప్రత్యేకించి వక్ఫ్ చట్టం రూపొందించారని గుర్తు చేశారు. ఈ చట్టం మేరకు వక్ఫ్ కౌన్సిల్, రాష్ట్ర వక్ఫ్ బోర్డులు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పేరుతో ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతారని చెప్పారు. ముస్లిం సమాజాన్ని అణచివేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై యావత్ ముస్లిం సమాజం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తుందని, దేశంలో ముస్లిం సోదరులకు జీవించే హక్కును హరించేలా ప్రభుత్వాలు తీవ్రమైన నిర్ణయాలు, చర్యలకు పాల్పడడం విచారకరమన్నారు.

ఈదురుగాలులతో వర్షం


ఈదురుగాలులకు రోడ్డుపై కూలిన చెట్లను తొలగిస్తున్న దృశ్యం


కొత్తూరులో నేలకొరిగిన స్తంభం

పోలవరం రూరల్: పోలవరం మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో వర్షం కురిసింది. దీంతో పట్టిసం – జీలుగుమిల్లి జాతీయ రహదారిలో వెంకటాపురం, ఎల్ఎన్‌డీపేట గ్రామాల మధ్య చెట్లు కూలిపోయాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న తహసీల్దార్ ఆర్‌ఎస్‌రాజు రెవెన్యూ, పోలీసు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని తెలిపారు.

తప్పిన ప్రమాదం

కామవరపుకోట: స్థానిక కొత్తూరు కాలనీలో ఆదివారం సాయంకాలం ఈదురుగాలులకు ఒక్కసారిగా విద్యుత్ స్తంభం విరిగి పడిపోయింది. స్తంభం కింద పడే సమయంలో పక్కనే చిన్నపిల్లలు ఆడుకుంటున్నారు. అయితే త్రుటిలో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై విద్యుత్ అధికారులను వివరణ కోరగా విద్యుత్ స్తంభాన్ని పునరుద్ధరిస్తామని తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

జంగారెడ్డిగూడెం: స్థానిక జాతీయ రహదారిలో హ్యుందాయ్ షోరూం సమీపంలో ఆదివారం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. టి.నరసాపురం మండలం తిరుమలదేవిపేటకు చెందిన తోట లక్ష్మీనారాయణ (42) పిల్లల చదువుల కోసం ప్రస్తుతం జంగారెడ్డిగూడెంలో నివసిస్తున్నాడు. లక్ష్మీనారాయణ మోటార్‌సైకిల్‌పై జంగారెడ్డిగూడెం నుంచి వేగవరం వైపు వెళ్తుండగా జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో లక్ష్మీనారాయణ అక్కడికక్కడే మృతిచెందాడు. జంగారెడ్డిగూడెం ఎస్సై షేక్ జబీర్‌కు సమాచారం రావడంతో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని చేధించేందుకు రహదారిపై ఉన్న సీసీ కెమెరాను పోలీసులు పరిశీలిస్తున్నారు. లక్ష్మీనారాయణకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఆక్వాను ఆదుకోండి!

నష్టాల ఊబిలో కూరుకుపోయాం: రొయ్య రైతుల ఆవేదన


గణపవరంలో ఆందోళన చేస్తున్న రొయ్య రైతులు

గణపవరం: తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిన ఆక్వాను ప్రభుత్వం ఆదుకోవాలని, లేదంటే ఆక్వా రైతులకు ఆత్మహత్యలే శరణ్యమని పలువురు ఆక్వా రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం సాయంత్రం గణపవరం కన్యకా పరమేశ్వరి వర్తక సంఘ భవనంలో గణపవరం, నిడమర్రు, ఉండి, ఆకివీడు, పెంటపాడు, ఉంగుటూరు మండల గ్రామాలకు చెందిన ఆక్వా రైతులు సమావేశమై సాగులో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై చర్చించారు. సమావేశానికి ఆక్వా రైతు అడబాల రంగా అధ్యక్షత వహించారు. సమావేశంలో పలువురు రొయ్య రైతులు సాగులో ఇబ్బందులపై మాట్లాడారు. వ్యాపారుల మాయాజాలం, సీడ్‌లో మోసాలు, షాక్ కొడుతున్న విద్యుత్ బిల్లులు, పెరిగిపోతున్న మేతల ధరలు, పడిపోతున్న రొయ్య ధరలపై గళమెత్తారు. ప్రస్తుతం రొయ్యల సాగు తీవ్ర నష్టాల బాటలో నడుస్తుందని, 95 శాతం మంది రొయ్యల రైతులు నష్టాల పాలయ్యారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి రొయ్య సాగును ఆదుకోవాలని కోరారు. సమావేశంలో పలువురు ఆక్వా రైతులు తమ కష్టనష్టాలను మొరపెట్టుకున్నారు. పులిమీద పుట్రలా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తెచ్చిన కొత్త సుంకం ఆక్వా రంగాన్ని మరింత కుదేలు చేసింది. ట్రంప్ ప్రకటన వెలువడి క్షణాల్లో రాష్ట్ర వ్యాప్తంగా రొయ్య ధరలు అమాంతం పతనమైపోయాయి. అసలు అమెరికాకు 30 కౌంట్ లోపు ఉన్న రొయ్యలో ఎగుమతి అవుతాయని, ఇక్కడి వ్యాపారులు 100 కౌంట్ రొయ్య ధరను ఒక్కసారిగా రూ.30 నుంచి రూ.40 తగ్గించి వేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టి ఆక్వా రైతులను ఆదుకోకపోతే సాగు కొనసాగించలేమని ముక్త కంఠంతో చెప్పారు. సమావేశంలో పలువురు రైతులు మాట్లాడి తమ సమస్యలు చెప్పుకున్నారు. అనంతరం రైతులు నినాదాలు చేస్తూ గణపవరం సెంటర్‌లోని మూడు రోడ్ల కూడలిలో కొంతసేపు ఆందోళన నిర్వహించి రొయ్య రైతులను ఆదుకోవాలంటూ నినాదాలు చేశారు. తమకు న్యాయం చేయాలంటూ గణపవరం ప్రధాన రోడ్డు మీద ప్రదర్శన చేశారు.


ఎన్నడూ చూడని సంక్షోభం



మూడు దశాబ్దాల్లో ఎప్పుడూ చూడని సంక్షోభాన్ని ప్రస్తుతం రొయ్య సాగుదారులు ఎదుర్కొంటున్నారు. ఒకవైపు మేతల ధరలు పెరిగిపోయి సాగు భారంగా మారిన పరిస్థితులలో వ్యాపారులు సిండికేట్‌గా మారిపోయి రొయ్య ధర అమాంతం తగ్గించి వేస్తున్నారు. ఈ పరిస్థితిని అధిగమించాలంటే రొయ్య రైతులు రోడ్డెక్కి ఆందోళన చేయాల్సిందే.

రుద్రరాజు యువరాజు,
ఆక్వా రైతు సంఘం, రాష్ట్ర కమిటీ సభ్యుడు

కిలోకు రూ.40 తగ్గించారు



అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాల వంకతో ఇక్కడి వ్యాపారులు రొయ్య ధర కిలోకు అమాంతం రూ.40 వరకూ తగ్గించి వేశారు. ఈ ధరకు అమ్ముకుంటే రైతులు కోలుకోలేని విధంగా నష్టాల పాలవుతారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆక్వా సాగుపై కఠిన నిర్ణయాలు తీసుకుంటే తప్ప ఆక్వా సాగు సంక్షోభం నుంచి బయట పడే పరిస్థితులు లేవు.

కాకర్ల వినాయకం,
ఆక్వా రైతు సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి

రెండెకరాలు అమ్ముకున్నాను



ఆక్వా రైతులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పదెకరాల నిబంధన తీసివేసి రైతులందరికి విద్యుత్ యూనిట్ రూ.1.50కు ఇవ్వాలి. నేను 40 ఎకరాల్లో రొయ్య సాగు చేసి అప్పులు తీర్చడానికి సొంత పొలం రెండెకరాలు ఇటీవల అమ్ముకున్నాను. విద్యుత్ సబ్సిడీ లేక బిల్లును లక్షల్లో కడుతున్నారు. ప్రస్తుతం 30 ఎకరాలు వదిలేసి పదెకరాలలో రొయ్య సాగు కొనసాగిస్తున్నాను.

–ఆదిమూలం శ్రీనివాస్, ఆక్వా రైతు, వాకపల్లి

ప్రభుత్వ నియంత్రణ ఉండాలి



ట్రంప్ అనాలోచిత నిర్ణయం వల్ల ఆక్వా రైతులు రోడ్డున పడే దుస్థితి దాపురించింది. వ్యాపారుల మాయాజాలం వల్ల వారం రోజుల్లోనే రొయ్యల అమ్మకంలో నాలుగు లక్షల నష్టం వచ్చింది. వారం క్రితం అమ్మిన ధరకూ నాలుగు రోజుల అనంతరం అమ్మిన ధరకూ కిలోకు రూ.50 తగ్గిపోవడంవల్ల నాలుగు లక్షలు నష్టపోయాను.

–గరిపాటి సాయిరాం , ఆక్వారైతు, చానమిల్లి

క్లుప్తంగా

చలి వేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ తానేటి శ్రీనివాస్, తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): శ్రీరామ నవమి సందర్భంగా స్థానిక చైతన్య ఎమర్జెన్సీ ఆసుపత్రి వద్ద వారి సౌజన్యంతో ఆదివారం చలి వేంద్రం ఏర్పాటు చేశారు. వైద్యులు డాక్టర్ తానేటి శ్రీనివాసరావు ప్రారంభించి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వేసవిలో చలి వేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. చలి వేంద్రంలో పానకం అందజేశారు. ఆసుపత్రి నిర్వాహకులు కె.సోమేశ్వరరావు, తిరుమళ్ల సూరిబాబు, డాక్టర్ బి.దివ్యశ్రీ, బాకా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో..

పెంటపాడు: ప్రత్తిపాడు సెంటర్‌లో వన్ టీం –వన్ విజన్ యూత్ సభ్యులు ఆదివారం చలి వేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని యూత్ సభ్యుల కోరిక మేరకు గూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తనయుడు బొలిశెట్టి రాజేష్ ప్రారంభించారు. తొలిరోజు మజ్జిగను పాదచారులకు అందించారు. కార్యక్రమంలో గ్రామ యూత్ సంఘసభ్యులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఉచిత వైద్య సేవలు



వృద్ధురాలికి పరీక్షలు చేస్తున్న వైద్యులు

తణుకు అర్బన్: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఇంటికే పరిమితమైన వృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందజేశారు. ప్రముఖ సీనియర్ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, డాక్టర్ సుంకవల్లి నీలు మహేంద్రలు తణుకు, పైడిపర్రు ప్రాంతాల్లోని ఆరుగురు వృద్ధుల ఇళ్లకు వెళ్లి వైద్య సేవలందించారు. సూరపనేని సత్యనారాయణ ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర చౌదరి తెలిపారు. ఈ వైద్య సేవల్లో నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

పెంటపాడు: ఈ నెల 8న మంగళవారం మీనవల్లూరు ఏసయ్యా ప్రార్ధన మందిరం (పాస్టర్ కృష్ణ చర్చి)లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డీవీ కృష్ణ ట్రస్టు వ్యవస్థాపకుడు పాస్టర్ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. నిడదవోలు రాజేశ్వరి లయన్స్ కంటి వైద్య నిపుణులు పరీక్షలు చేసి అవసరమైన వారికి ఆపరేషన్లు చేస్తారన్నారు. కళ్లజోళ్లు అవసరమైన వారికి ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పరిసర గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రోడ్డుపై చెత్తతో వాహనదారుల ఇక్కట్లు



రాచర్ల శ్మశానం వద్ద రోడ్డుపైకి వచ్చిన డంపింగ్‌యార్డులోని చెత్త

పెంటపాడు: డంపింగ్ యార్డుకు తరలించాల్సిన చెత్త రోడ్డుపైకి రావడం వలన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాచర్ల గ్రామం నుంచి రావిపాడు వెళ్లే దారిలో శివాలయం పక్కన శ్మశానం ఉంది. అదే ప్రాంతాన్ని పంచాయతీ అధికారులు డంపింగ్ యార్డుగా ఉపయోగిస్తున్నారు. కాగా ఆ డంపింగ్ యార్డుకు గోడ అడ్డుగా లేకపోవడం వలన వేసిన చెత్త రోడ్డుపైకి వస్తోంది. దుర్వాసన రావడంతో అక్కడి ప్రజలు, అటుగా వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

పాస్టర్ మృతిపై సమగ్ర విచారణ చేయాలి

ఉండి: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ చేయించాలని యండగండి ఇమ్మానుయేలు లూథరన్ చర్చ్ క్రైస్తవ సోదరులు మండిపడ్డారు. పాస్టర్ ప్రవీణ్ మృతిపై తగిన న్యాయం చేయాలంటూ ఆదివారం యండగండిలో క్రైస్తవ సోదరులు శాంతి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ డి.ప్రసాదరావు మాట్లాడుతూ పాస్టర్లపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు జౌదుల రాజ్‌కుమార్, ఏనేపల్లి సుబ్బరాజు, బొట్టు తాతారావు, కొమ్ముల దావీదు, విప్పర్తి బుచ్చియ్య, పీసీసీ సభ్యుడు తాడేపల్లి మోషే, నూకపాయి రాంకుమార్, గొర్రుముచ్చు సుందర్ కుమార్, వెలగపల్లి టోనీ, మానుకొండ సురేష్, విప్పర్తి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాములోరి కల్యాణం



తాడేపల్లిగూడెం (టీటీసీ): శ్రీవాసవీ ఆలయంలో కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న పండితులు



తాడేపల్లిగూడెం రూరల్: జగన్నాథపురం కాపుల రామాలయంలో కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): శ్రీరామ నవమి సందర్భంగా ఆదివారం పట్టణంలోని అన్ని రామాలయాల్లో రాముల వారి కల్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయాలు వద్ద భక్తులకు పానకం, వడపప్పు పంచారు. గొల్లగూడెం పురాతన కోదండ రామాలయంలో స్వామి వారికి, అమ్మవారికి వేద పండితులు బ్రహ్మత్వంలో కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పేరూరి కాశయ్య, గ్రంధి సత్యనారాయణ, పెనుగొండ శ్రీనివాసరావు పాల్గొన్నారు. డాక్టర్ కొండ్రెడ్డి శశి కుమార్ దంపతుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. సుబ్బారావుపేట కోదండ రామాలయంలో, స్థానిక నందిబొమ్మ సెంటర్‌లో రామాలయంలో, శాలిపేట రామాలయం, ఐదోవ వార్డు పాబోలు వారి వీధిలో శ్రీ శ్రీనివాస రామాలయం, పాతూరులో వినాయకుడి గుడి వద్ద రామాలయం, శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయం వద్ద రామాలయం, నందిబొమ్మ సెంటర్‌లోని రామాలయంలో టూ టౌన్‌లోని సీతారాంపేట రామాలయం, చిన్న వంతెన వద్ద కోదండ రామస్వామి ఆలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.

వైభవంగా రాములోరి కళ్యాణం

తాడేపల్లిగూడెం రూరల్: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ఆదివారం మండలంలోని ప్రతి గ్రామంలో రామాలయం, ఆంజనేయ స్వామి వార్ల ఆలయాల్లో సీతారాముల కల్యాణాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రధానంగా మోదుగగుంట, కుంచనపల్లి, చినతాడేపల్లి, పెదతాడేపల్లి, మాధవరం, జగన్నాథపురం, అప్పారావుపేట, కృష్ణాపురం, నీలాద్రిపురం, కొమ్ముగూడెం, కృష్ణాయపాలెం, పట్టింపాలెం, జగ్గన్నపేట, వెంకట్రామన్నగూడెం తదితర గ్రామాల్లో కల్యాణాలు నిర్వహించారు. అర్చకులు వేదోక్తంగా కల్యాణాన్ని నిర్వహించారు. కాగా మాధవరం నడి వీధి రామాలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. సర్పంచ్ పోలిమోను నాగ అంజూష శ్రీనివాస్, మాజీ ఎంపీపీ పరిమి రవికుమార్, ప్రవా శ్రీనివాస్, ముత్యాల వీరవెంకటసత్యనారాయణ, ఉప సర్పంచ్ గూడవల్లి శ్రీనివాస్, కట్టా జానకీరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

పెంటపాడు: శ్రీరామనవమి పురస్కరించుకొని చైత్ర శుద్ధ నవమి సందర్భంగా పలు గ్రామాలు, పట్టణాల్లోని రామాలయాల్లో సందడి నెలకొన్నాయి. పలు ఆలయాల్లో బెల్లం పానకం, వడపప్పు, చలిమిడి నైవేద్యాలను భక్తులకు పంపిణీ చేశారు. పలు ఆలయాలలో అన్నసమారాధనలు చేసారు. నియోజకవర్గంలో ప్రసిద్ధి చెందిన కె. పెంటపాడు బైరాగి మఠంలోని గోపాలస్వామి వారి ఆలయంలో శ్రీరామనవమి పురస్కరించుకొని ఉదయం 6 గంటలకు స్వామివారికి నిత్యార్చనలు, విశేషపూజలు, హోమాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం 9 గంటలకు కల్యాణ ప్రక్రియకు సంబంధించి ఎదుర్కోలు ఉత్సవం, ఉదయం 11.52 గంటలకు సీతారాముల కల్యాణం వైభవంగా సాగింది. ఆలయ ఈవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అర్చకులు త్రిలోచన దాసు, పూర్ణచంద్ర త్రిపాఠిలు కల్యాణ తంతుకు సంబంధించి మంగళసూత్రధారణ, జీలకర్ర బెల్లం, మంగలసూత్ర దారణ, ముత్యాల తలంబ్రాల నిర్వహణ తదితర కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధనలో సుమారు 6 వేల మంది భక్తులు స్వామివారి ప్రసాదం స్వీకరించారు. చుట్టుపక్కల గ్రామాలనుండి భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు గ్రామస్తుల ఆధ్వర్యంలో కోలాటం, సాయంత్రం 4 గంటలకు డి. కేశవరానికి చెందిన బ్యాండ్ పార్టీ, ఈశ్వరి కేరళ సింగారి మేళం, తేతలివారి నాసిక్‌డోలు, లలిత కోటేశ్వరి సన్నాయి మేళం, పసలపూడి వారి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి స్వామివారికి గరుడ వాహనోత్సవం, స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కుటుంబసభ్యులు, టీడీపీ ఇన్‌చార్జి వలవల బాబ్జి దంపతులు, వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఈలి నాని లు స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు, పళ్లు స్వామి వార్లకు సమర్పించారు. పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామాల ప్రముఖులు ఈ కల్యాణ కార్యక్రమంలో పాల్గొన్నారు.



పెంటపాడు: ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



అత్తిలి: శ్రీసీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న పండితులు

పలు ఆలయాలలో ప్రత్యేక పూజలు

శ్రీరామనవమి పురస్కరించుకొని పెంటపాడు రెడ్ల రామాలయం, కాపుల రామాలయం, వెలంపేటలోని రెండు రామాలయాలు, శెట్టిబలిజ రామాలయం, ఎస్సీపేట రామాలయం, వైష్ణవుల కు చెందిన శ్రీరామాలయం, పూరిగుడి రామాలయంలో ప్రత్యేక కల్యాణాలు జరిగాయి. కె. పెంటపాడులో నడిమింటి రామాలయంలో వైఎస్సార్ సీపీ నాయకులు గ్రామ మాజీ సర్పంచ్ చోడగిరి చినబాబు, విశ్రాంత ఎల్ఐసీ డెవలప్‌మెంట్ అధికారి, ఏలూరుకు చెందిన వైద్యులు కల్యాణం నిర్వహించారు. మహిళలకు రవికెలు, పళ్లు, పూలు, పసుపు కుంకుమ, భక్తులకు విసన కర్రలు పంపిణీ చేశారు. మీనవిల్లూరులో కాపుల రామాలయం, కొండేపాడులో శెట్టిబలిజ రామాలయం, అలంపురం తూర్పుకాపుల రామాలయం, కాగులంపాడులోని రామాలయం, ప్రత్తిపాడు సెంటర్‌లోని రామాలయం, కోదండ రామాలయం, జట్లపాలెం, ఉమామహేశ్వరం, మౌంజీపాడు గ్రామాలలోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బైరాగిమఠంలో నేడు దివ్యరథోత్సవం

మండలంలోని కె.పెంటపాడు బైరాగిమఠంలోని గోపాలస్వామి ఆలయంలో శ్రీరామ నవమి ఉత్సవాలు పురస్కరించుకొని సోమవారం సాయంత్రం దివ్య రథోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో బీవీ చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం ప్రత్యేక పూజలు, తులసీదళ పూజలు, సహస్రనామార్చనలు, నిత్య హోమాలు, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వాడవాడలా సీతారాముల కల్యాణోత్సవాలు

అత్తిలి: శ్రీరామ నవమి సందర్భంగా మండలంలో వాడవాడలా సీతారాముల కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అత్తిలి గ్రామంలో కోదండ రామాలయంలో సీతారామ కల్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన పడగా కృష్ణ, వెంకటరమణ దంపతులచే శ్రీస్వామివారి కల్యాణ తంతును నిర్వహించారు. ఆలయ అర్చకులు వాడపల్లి కృష్ణమాచార్యులు, వాడపల్లి హనుమంత సీతారామాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు. అత్తిలి శివారు గోగులమ్మపేట చిన రామాలయం సింహాద్రి, పద్మ దంపతులు, పెద రామాలయం వద్ద కురేని వెంకటేశ్వరరావు, విజయలక్ష్మి దంపతులు, రామన్నపేట శ్రీరామాలయంవద్ద గొర్లి సన్యాసిరావు దంపతులు, గొర్లి వెంకట్రావు దంపతులు, రైల్వేస్టేషన్ రోడ్డు రామాలయాల వద్ద అంకినరావు సత్యనారాయణ, వెంకటలక్ష్మి దంపతులచే శ్రీసీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయంలో దాస సాహిత్య ప్రాజెక్టు వారిచే కోలాట భజన నిర్వహించారు.



తాడేపల్లిగూడెం (టీటీసీ): శాలిపేట రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



అత్తిలి: కోలాట భజన నిర్వహిస్తున్న దాస సాహిత్య నాట్య బృందం



కె.పెంటపాడులో శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొన్న మహిళలు

నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

భీమవరం: యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (వైహెచ్ఏఐ) భీమవరం యూనిట్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. భీమవరంలో ఆదివారం కోపా కల్యాణ మండపంలో నిర్వహించిన 36వ మహాజన సభలో యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులుగా మంతెన వెంకట నర్సింహ సీతారామరాజు, కటికరెడ్డి వెంకటరత్నం, కోశాధికారి శ్రీఖాకొల్లు హనుమంతరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ ఆరేటి వెంకట సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా బోనం పాండురంగారావు, సరిపిడకల రామారావు, చైర్మన్‌గా మట్లపూడి సత్యనారాయణ, కన్వీనర్‌గా గన్నాబత్తుల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా తాళ్లపూడి గాంధీ, వబిలిశెట్టి వెంకటేశ్వరావు, సాగి సత్యనారాయణరాజు, కడియం ఈశ్వరరావు, దేవరపు చంద్రశేఖర్, సోడదాసి అనిల్‌దేవ్, సుభద్రదేవి, కొప్పినీడి సూర్య ప్రకాష్, పిండి శ్రీనివాసరావు, గోపిశెట్టి మురళీ కృష్ణారావు, నేరేడిమిల్లి మహేష్ లను ఎన్నుకున్నారు.

రైతాంగంపై 'కూటమి' కన్నెర్ర

ఆకివీడు: రైతాంగ వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు నంద్యాల సీతారామయ్య ధ్వజమెత్తారు. ఆక్వా, వరి రైతులు పడుతున్న ఇబ్బందులపై ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. వరి రైతులకు కనీసం మద్దతు ధర లభించకుండా చేస్తున్నారన్నారు. ఖరీఫ్‌లో రైతులు అయినకాడికి అమ్ముకోవలసి వచ్చిందని ఆరోపించారు. దళారులు ప్రవేశించి ధాన్యంలో తేమ, రంగు మారిందని సాకులతో ధరలు తగ్గించి మిల్లర్లకు అమ్ముతున్నారన్నారు. గతంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో వరి రైతుల అకౌంట్లలో మద్దతు ధర పూర్తిగా పడిందన్నారు. ఈ దాళ్వా సీజన్‌లోనైనా రైతులకు మద్దతు ధర లభించే విధంగా ప్రభుత్వం, అధికారులు కృషి చేయాలన్నారు.

ఆక్వా రైతులను ముంచేశారు

ఆక్వా రైతులను కూటమి ప్రభుత్వం నిండా ముంచేసిందని సీతారామయ్య ఆవేదన వ్యక్తం చేశారు. గత పది నెలల్లో ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఒక పక్క రొయ్యకు ధరను తగ్గించి వేస్తున్నారని, మరో పక్క మేత ధరలను విపరీతంగా పెంచి వేస్తున్నారని ఆరోపించారు. రొయ్య ధరలు కూటమి నాయకుల చేతుల్లోనే ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఆక్వా రైతులకు ఇచ్చిన హామీలను ఒక్కటీ అమలు చేయలేదని ధ్వజమెత్తారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లిగూడెం (టీఓసీ): టూ టౌన్‌లో యాగర్లపల్లి సబ్‌స్టేషన్ నుంచి జట్లపాలెం రోడ్ల వరకు విద్యుత్ లైన్ల ఏర్పాటు నిమిత్తం ఈ నెల 7వ తేదీ సోమవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ కె.నరసింహమూర్తి వెల్లడించారు. యాగర్లపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో జట్లపాలెం ఫీడర్ (పెంటపాడు సెక్షన్)కు సంబంధించి విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ ఉండదని, సహకరించాలని కోరారు.

విద్యార్థులకు బస్సు పాస్‌లు

తణుకు అర్బన్: ఇంటర్మీడియేట్ ద్వితీయ సంవత్సరం తరగతులకు హాజరువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు ఈ నెల కూడా ఆర్టీసీ రాయితీ బస్సు పాస్‌ల కోసం రెన్యూవల్ చేయించుకోవచ్చని తణుకు డిపో మేనేజరు సప్పా గిరిధర్ కుమార్ తెలిపారు. సోమవారం నుంచి సంబంధిత ధ్రువ పత్రాలతో ఆర్టీసీ డిపోలోని కౌంటర్ వద్ద రెన్యువల్ చేయించుకోవచ్చని వివరించారు.

నేటి నుంచి సువార్త పండుగలు

పెంటపాడు: ఈ నెల 7,8 తేదీల్లో కోరిమిల్లి గ్రామంలో సువార్త పండుగలు నిర్వహించనున్నట్లు సంఘ దైవ సేవకులు మల్లిపూడి ఒనేసిం, అరుణ ఒనేసిమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ సాయంత్రం 7 గంటలకు నిర్వహించబోయే ఈ సమావేశాలకు జి.డేనియల్ జిత్తో (వైజాగ్), షేక్ మక్బూల్ (రాజమండ్రి), జి.విజయ్య (బిట్రగుంట) హాజరువుతారన్నారు. పరిసర గ్రామ విశ్వాసులు తప్పక పాల్గొనాలని ఈ సందర్భంగా ఒనేసిం కోరారు.

పరాయి పంచన ప్రభుత్వ కార్యాలయం



పెనుమంట్ర మహిళా మండలి భవనంలో నిర్వహిస్తున్న తహసీల్దార్ కార్యాలయం



పెనుమంట్ర ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పునాదిలోనే నిలిచిపోయిన తహసీల్దార్ కార్యాలయ భవనం

- తహసీల్దార్ కార్యాలయానికి సొంత గూడు కరువు

పెనుమంట్ర: మండల రెవెన్యూ వ్యవస్థ ఏర్పడి నాలుగు దశాబ్దాలు పూర్తి అవుతున్నా పెనుమంట్ర మండల రెవెన్యూ కార్యాలయానికి సొంత భవనం లేక పరాయి పంచనే ఇరుకు గదుల్లో సిబ్బంది కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. 1985లో మండల రెవెన్యూ వ్యవస్థను ఏర్పాటు చేసిన సమయంలో పెనుమంట్ర గ్రామ కచేరి భవనంలో మండల రెవెన్యూ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. క్రమేపి ఆ భవనం శిథిలావస్థకు చేరడంతో 2001లో మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న బ్రాహ్మణచెరువులో ఇరిగేషన్ బంగ్లాలో తహసీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఇదీ శిథిలాస్థితికి చేరుకోవడంతో 2017లో పెనుమంట్ర మెయిన్ రోడ్డులో సొసైటీ పక్కన ఉన్న మహిళా మండలి భవనాన్ని మరమ్మతులు చేసి, అందులో తహసీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు.

శంకుస్థాపనకే పరిమితం

అనంతరం ఇరిగేషన్ బంగ్లాను కూల్చివేసి ఆ స్థలంలో రూ.90 లక్షల అంచనా వ్యయంతో 2018 ఏప్రిల్ 27న అప్పటికార్మికశా ఖ మంత్రి ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. ఈ భవన నిర్మాణాన్ని అర్ధాంతరంగా పు నాది దశలోనే వదిలేశారు. ఇటీవల జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఈ ప్రాంతాన్ని సందర్శించి రెవెన్యూ కార్యాలయం నిర్మించేందుకు ఇంజినీరింగ్ అధికారుల ను ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశాలు ఇచ్చా రు. కలెక్టర్ ఆదేశాలతో అయినా అధికారులు తహసీల్దార్ భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటారో? లేదో? వేచి చూడాలని స్థానికులు పేర్కొంటున్నారు.

ప్రతిపాదనలు పంపారు



జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇంజినీరింగ్ అధికారులు రూ. 1.10కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు రూపొందించి జిల్లా అధికారులకు పంపించారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే నిర్మాణ పనులు తిరిగి ప్రారంభిస్తారు.

– వై.రవికుమార్, తహసీల్దార్, పెనుమంట్ర

సబ్‌స్టేషన్ నిర్మాణానికి మోక్షం కలిగేనా?

- రూ.133 కోట్లతో సబ్ స్టేషన్ నిర్మాణానికి గత ప్రభుత్వం అడుగు
- టెండర్ దశలో నిలిచిన భారీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు



నరసాపురంలో ప్రస్తుతం ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్

నరసాపురం: నరసాపురంలో భారీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూనుకుంది. స్వయంగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. టెండర్ దశకు చేరుకున్న ఈ ప్రాజెక్ట్ నిర్మాణం కొత్త కూటమి ప్రభుత్వంలో అటకెక్కింది. వేసవి వచ్చేసింది. జనం లో ఓల్టేజ్ సమస్యతో నానా ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ లో–ఓల్టేజ్ సమస్యలకు చెక్ పెడుతూ రూ.133 కోట్లుతో 10 ఎకరాల స్థలంలో 50 ఎంవీఏ సామర్థ్యంతో 220/132/11 కేవీ భారీ సామర్థ్యంతో ఈ కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్‌ను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్మించ తలపెట్టింది. అన్నీ సవ్యంగా సాగితే ఇప్పటికే సబ్‌స్టేషన్ సేవలు అందుబాటులోకి వచ్చేవి. గత ప్రభుత్వం ట్రాన్స్‌కో ద్వారా దీనికి సంబంధించి జీవో నెంబర్ 2368ని 2021 ఫిబ్రవ రినెలలో విడుదల చేసింది. వెంటనే టెండర్లు పిలిచి పనులు మొదలు పెట్టడానికి సన్నాహాలు చేశారు. అయితే ప్రభుత్వం మారడంతో పనులకు అతీగతీ లేకుండా పోయింది.

లో–ఓల్టేజ్ సమస్య పరిష్కరించాలని..

నరసాపురంలో ఇప్పటికే 132/11 కేవీ సబ్‌స్టేషన్ ఉంది. ఈ సబ్‌స్టేషన్‌లో గతంలో 50 ఎంవీఏ సామర్థ్యం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఉండేది. 2020లో ఆ ట్రాన్స్‌ఫార్మన్ సామర్థ్యాన్ని 80 ఎంవీఏకుపెంచారు. మళ్లీ అదనంగా దానికి అనుసంధానంగా మరో 50 ఎంవీఏ సామర్థ్యం ఉన్న కొత్త 220/132/11 కేవీ సబ్‌స్టేషన్‌ను అందుబాటులోకి తేవాలని గత ప్రభుత్వలో నిర్ణయించారు. నరసాపురం, పాలకొల్లు, యలమంచిలి, మొగల్తూరు, పోడూరు మండలాలకు ప్రస్తుతం నరసాపురం సబ్‌స్టేషన్ నుంచే విద్యుత్ సరఫరా జరుగుతుంది. ఇందులో నరసాపురం, పాలకొల్లు మున్సిపాలిటీలు ఉన్నాయి. నరసాపురం, పాలకొల్లు రూరల్ మండలాలు, యలమంచిలి, మొగల్తూరు, పోడూరు మండలాల్లో ఎంతోకాలంగా విద్యుత్ లో–ఓల్టేజ్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యలకు చెక్ పెట్టడానికి భారీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించాలని గత ప్రభుత్వంలో అప్పటి ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ఈ ప్రాజెక్ట్ మంజూరు చేయించారు. వెంటనే రుస్తుంబాధలో 10 ఎకరాల స్థలాన్ని సేకరించారు. ఇప్పటికైన అధికారులు, నాయకులు స్పందించిన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.